

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,19,986
బంగారం	950 మిల్లీ గ్రాములు
వెండి	48 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి

కేంద్రమంత్రి జుయెల్ ఓరాం ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలగనున్నట్లు శనివారం ప్రకటించారు.

- 8లో▸



నకిలీ మావోయిస్టులు అరెస్టు

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసులు శనివారం సాయంత్రం ముగ్గురు నకిలీ మావోయిస్టులను అరెస్టు చేశారు.

- 8లో▸

న్యూస్‌రీల్

ఒడిశాకు ఉత్తమ రాష్ట్రం అవార్డు



అవార్డుతో గవర్నర్ హరిబాబు, డిప్యూటీ సీఎం కనక్ వర్ధన్ సింగ్ దేవ్

భువనేశ్వర్: వ్యవసాయ రంగంలో ఒడిశా రాష్ట్రం జాతీయ స్థాయిలో ఉత్తమ రాష్ట్రం బహుమతి గెలుచుకుంది. ఈనెల 9వ తేదీన న్యూఢిల్లీలో అగ్రికల్చర్ టుడే గ్రూప్ నిర్వహించిన ప్రతిష్టాత్మక 16వ వ్యవసాయ నాయకత్వ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ, రైతు సాధికారత విభాగం మంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ ఈ బహుమతిని అందుకున్నారు. రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత రాజ్ భవన్ సందర్శించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటికి బహుమతిని అందజేశారు. మంత్రితో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కూడా హాజరయ్యారు. ఈ బహుమతి వ్యవసాయ రంగంలో మరింత పురోగతి సాధనకు రాష్ట్ర ప్రజలను ప్రేరేపిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి సదరు పోలీసులు నలుగురు నిందితులను శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వారి నుంచి ఒక పదునైన కత్తి, మూడు సెల్‌ఫోన్లతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో జి.అజయ్, సతీష్ కుమార్, యామల్ సాయి, ఎం.మణికంఠలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించినట్లు ఐఐసీ ప్రసన్న కుమార్ బెహర తెలియజేశారు.

ములసుర-ఖండియగుడ వంతెన సందర్శన



కెనాల్‌పై వంతెన పరిస్థితిని పరిశీలిస్తున్న ఇంజినీర్లు

జయపురం: అప్పర్ కొలాబ్ సాగునీటి కెనాల్‌పై ములసుర-ఖండియగుడ గ్రామాల మధ్య శిథిలావస్థలో ఉన్న వంతెన మరమ్మతులు చేపట్టాలని సామాజిక కార్యకర్త బి.హరిరావు నేతృత్వంలో ఆయా గ్రామాల ప్రజలు ఎంతోకాలంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఈనెల 15వ తేదీలోపు చర్యలు చేపట్టకపోతే కొలాబ్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీంతో వంతెనను అధికారులు శనివారం పరిశీలించారు. వంతెనను వెడల్పుతో పాటు గార్డు వాల్‌లను నిర్మిస్తామని ప్రాజెక్టు ప్రధాన ఇంజినీర్ జుగల్ కిశోర్ కరువ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు అదనపు ప్రధాన ఇంజినీర్ శివ ప్రసాద్ పాణిగ్రహి, ప్రభుత్వ కార్యనిర్వాహక ఇంజినీర్ రజనీకాంత తదితరులు ఉన్నారు. అధికారుల హామీతో ముట్టడి నిర్ణయాన్ని విరమించుకున్నట్లు హరిరావు వెల్లడించారు.

నవ్వు సంజీవని వంటిది



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక చెక్కెగుడలోని ప్రేమ్ పహాడ్ వద్ద లాఫర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబురావు మహంతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవ్వు ఆరోగ్యానికి సంజీవనిలా పనిచేస్తుందన్నారు. వీలైనంత వరకు అందరూ నవ్వుతూ జీవనం గడపాలని సూచించారు. లాఫర్స్ క్లబ్ ఆవిర్భవించిన తర్వాత ఎంతోమంది ఉత్సాహంతో క్లబ్‌లో సభ్యులుగా చేరారని తెలియజేశారు. నవ్వు ఆవశ్యకత, దాని వల్ల కలిగే లాభాల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం వంటి చైతన్య కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తామన్నారు. ప్రతీ రెండో శనివారం క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్‌లో క్లబ్ కార్యక్రమాల గురించి చర్చించి, దానికి అనుగుణంగా కార్యకలాపాలు చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో సత్యవాది పతి, డాక్టర్ డీకే మహంతి, క్లబ్ కార్యదర్శి లాల్ బిహారి లెంక, ఉదయ పండ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో 9 పంచాయతీలు 154 గ్రామాలు ఉన్నాయి. 2018లో చిత్రకొండ జలాశయంపై జాన్‌బాయి ప్రాంతంలో గురుప్రియ వంతెనను నిర్మించారు. అప్పటి బీజేడీ ప్రభుత్వం రూ.187 కోట్లతో సుమారు 30 వేల మందికి రవాణా సౌకర్యం కలుగుతుందనే ఉద్దేశంతో వంతెన నిర్మాణం చేపట్టింది. అయితే ఈ వంతెన వలన 9 పంచాయతీల్లో జాంత్రీ పంచాయతీకి ఎటువంటి మేలు జరగలేదు. వంతెన నిర్మాణం జరిగినప్పటికీ వీరికి జలాశయంలో ప్రయాణం తప్పడం లేదు.

– మల్కన్‌గిరి

సమస్యల సుడిగుండంలో జాంత్రీ పంచాయతీ ● రోడ్డు మార్గం లేకపోవడంతో నదిలోనే ప్రయాణం

నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు పోతున్న వైనం ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జలాశయంలో ప్రయాణం.. గుప్పెట్లో ప్రాణం..!



ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్న జాంత్రీ ప్రజలు

నాటు పడవలోనే ప్రయాణం

ఈ పంచాయతీకి వెళ్లాలంటే ఇప్పటికీ లాంచీ లేదా నాటు పడవలోనే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడి గిరిజనులు తమ ప్రాణాలను పణంగా పెట్టి జలాశయం ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లేందుకు జెట్టీకి కట్టిన తాళ్లను తాగుతూ ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో అనేక సమయాల్లో పడవలు బోల్తా పడి ఎంతోమంది గల్లంతు అవ్వడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు రల్లేగడ – జాంత్రీ పంచాయతీల మధ్య జలాశయంలో మరో వంతెన నిర్మాణానికి అనేక సార్లు టెండర్లు వేసినా, నిర్మాణాలు ముందుకు కదలలేదు. అలాగే అర్లింకి – డోరఘాట్ గ్రామాల మధ్య కూడా వంతెన నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదు.

అనారోగ్యమొస్తే అంతే..

ఈ గ్రామాల్లో గిరిజనులకు అనారోగ్యం చేస్తే సరైన చికిత్స అందడం లేదు. అనారోగ్యానికి వైద్యం పొందేందుకు రోడ్డుమార్గం సదుపాయం లేకపోవడంతో సుమారు 7 గంటల పాటు పడవ ప్రయాణం చేయాలి. లేదంటే గ్రామానికి 15 రోజులకు ఒకసారి వచ్చే అంబులెన్స్ బోటు కోసం ఎదురుచూసి, వారి ఇచ్చే మందులను తీసుకోవాల్సి ఉంటుంది. గర్భిణులకు పురిటి నొప్పులు వస్తే కొంతదూరం డోలీలో తీసుకొని వస్తారు. అనంతరం అక్కడ నుంచి జాన్‌బాయి లేదా చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి పడవలో తరలిస్తారు. అలాగే ఇక్కడి విద్యార్థులు చదువుకోవాలన్నా ప్రమాదకర ప్రయాణం చేయక తప్పని పరిస్థితి ఉంది. పంచాయతీలో కేవలం అంగన్‌వాడీ కేంద్రం మాత్రమే ఉంది. ప్రాథమిక విద్యను అభ్యసించేందుకు తల్లిదండ్రుల సాయంతో నదిని దాటాల్సిందే.



అంబులెన్స్ బోటులో వైద్యసేవలందిస్తున్న ఏఎన్ఎం

అనారోగ్యాలతో ఇబ్బందులు



మా జాంత్రి పంచాయతీలోని అంగురుగూడ, బేసోయిగూడ, దాకడపదర్, దిశారిగూబ, మారివాడ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో బోర్లు ఉన్నప్పటికీ వాటి నుంచి తప్పుపట్టిన నీరు వస్తుండడంతో జలాశయం నీటిని మాత్రమే తాగాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో నిత్యం అనారోగ్యాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాకు ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే మాకు ఎటువంటి సంక్షేమ పథకాలు కూడా అందడం లేదు. మావోయిస్టుల ప్రభావం ప్రస్తుతం లేకపోయినప్పటికీ అభివృద్ధి లేకపోవడం బాధాకరం.

– నీలకంఠ గోలారి, సర్పంచ్, జాంత్రీ పంచాయతీ



జెట్టీకి కట్టిన తాడును లాగుతూ ప్రయాణం చేస్తున్న దృశ్యం



జాంత్రి పంచాయతీకి వెళ్తున్న అంబులెన్స్ బోటు



జలాశయం వద్ద గట్టుపై ప్రయాణం కోసం ఏర్పాటు చేసిన తాడు


వికసిత భారత్ స్ఫూర్తితో పాలన



ప్రధానమంత్రి మోదీతో సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: ఒడిశాలో వికసిత్ భారత్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్నట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని శనివారం ఆయన కలిశారు. దీనిలో భాగంగా వికసిత్ ఒడిశా రూపురేఖలు, అనుబంధ కార్యాచరణ ప్రణాళిక, తదనుగుణమైన భారత ప్రభుత్వ సమన్వయ, సహాయ సహకారాలపై ప్రధానమంత్రితో లోతుగా చర్చించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో సంకల్పించిన వివిధ అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వేగవంతమైన రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సంబంధించి వీరివురి మధ్య చర్చ ఫలప్రదంగా కొనసాగింది. అనంతరం ఆయన పలువురు కేంద్రమంత్రులు, భారతీయ జనతా పార్టీ సంస్థాగత ప్రముఖులను ప్రత్యక్షంగా కలిసి చర్చిస్తున్నారు. ఈ చర్చలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రేపో మాపో రాష్ట్రంలో మంత్రి మండలి విస్తరణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు తదితర ప్రతిష్టాత్మక సంస్థల ప్రముఖులు, సభ్యుల నియామకం జరగనుంది. ఢిల్లీలోని పెద్దల సంప్రదింపులతో వివాదరహితంగా ఈ కీలక కార్యాచరణ ముగించేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన దోహదపడుతుందని రాష్ట్ర శాఖ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఆహ్లాదకర ప్రయాణం



ఆసియాలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సు చిలికా నీలిరంగు నీటి సొగసుకు బలమైన హద్దుగా నిలిచిన దట్టమైన హరిత వర్ణపు కొండల నడుమ రైలు ప్రయాణం తూర్పు కోస్తా రైల్వే గుండా ప్రయాణించే వారికి ఒక అపురూప జ్ఞాపకం. భారతదేశంలోని అత్యంత ప్రకృతి రమణీయమైన రైలు మార్గాల్లో ఇదొకటి కావడం విశేషం. దక్షిణాది ప్రాంతాల నుంచి రాజధాని నగరం భువనేశ్వర్ పయనించే పర్యాటకులకు ఈ సహజ సౌందర్యమైన రైలు మార్గం సాదరంగా స్వాగతించి ఆహ్లాదభరితంగా సాగుతుంది.

– భువనేశ్వర్

కొంజామోజొడిలో దర్యాప్తు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీలోని కొంజామోజొడి గ్రామంలో చోటు చేసుకున్న అవమానకర ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ఫరూల్ పట్వారీ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న ఈ ఘటనకు సంబంధించి శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొంజామోజొడి గ్రామంలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఆదివారం దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. కల్యాణ సింగుపూర్ బీడీవో, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, సీడీపీవో తహసీల్దార్లతో కూడిన ఒక బృందం ఆ గ్రామానికి చేరుకుని నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. గ్రామస్తులతో సమావేశమై వారి నుంచి వివరాలు తెలుసుకున్న అనంతరం ఒక నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన అనంతరం, ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ప్రేమ వివాహం చేసుకున్న ఇద్దరిని ఊరు పెద్దలు వెలివేశారు. ప్రేమికుల ఇద్దరిని నాగలికి రెండు వైపులా కట్టి పొలం దున్నించారు. వరుసకు పిన్ని అయిన కొడియా సరక అనే ఆదివాసీ యువతిని అదే గ్రామానికి చెందిన లక సరక అనే యువకుడు ప్రేమించి వివాహం చేసుకున్నాడు. దీనిని వ్యతిరేకించిన గ్రామ పెద్దలు వారిపై దండన విధించిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మల్కన్‌గిరి: జిల్లాలో కలిమెల పోలీసుస్టేషన్ పరిధిలోని 326 నంబర్ జాతీయ రహదారి బడిగుడా పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం ఉదయం ఒక ద్విచక్ర వాహనానికి పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తలకు గాయాలు తీవ్రంగా ఉండడంతో అక్కడ నుంచి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా కలిమెల ఆరోగ్య కేంద్రానికి వెళ్లి యువకుడిని పరిశీలించారు. యువకుడికి మెలకువ వస్తేనే వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది.



ప్రమాదంలో గాయపడిన యువకుడు



ప్రమాద స్థలంలో ద్విచక్రవాహనం

పర్లాకిమిడిలో భారీ వర్షం

పర్లాకిమిడి: పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో గత మూడు రోజులుగా ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. జూలై మాసంలో అత్యధిక వర్షం ఇదే కావడం విశేషం. వర్షం కారణంగా పట్టణంలో మార్కెట్ వద్ద విద్యుత్‌కు అంతరాయం కలిగింది.



పర్లాకిమిడి మార్కెట్ వద్ద కురుస్తున్న వర్షం


మాజీ సీఎం నవీన్‌కు అపూర్వ స్వాగతం

భువనేశ్వర్: మాజీ సీఎం, రాష్ట్ర విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పూర్తి ఆరోగ్యంతో కోలుకొని ముంబై నుంచి శనివారం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ఆయనపై రాష్ట్ర ప్రజల విశేష ఆదరాభిమానాలకు ఈ సన్నివేశం అద్దం పట్టింది. రెండు దశాబ్దాలు పైబడి ముఖ్యమంత్రిగా ఆదరణ పొందిన నవీన్ పట్నాయక్‌కు విపక్ష నేతగా కూడా ప్రజాదరణకు నోచుకోవడం విశేషం. చికిత్స కోసం ఆయన ముంబైకి బయల్దేరిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ప్రముఖ దేవస్థానాల్లో సామూహిక దీపారాధన, అర్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. చికిత్స విజయవంతమై ఆరోగ్యంతో తిరిగి వచ్చిన సందర్భంగా ఆందోత్సాహాలు వ్యక్తం చేశారు. పదవులు, అధికారం, హోదాకు అతీతంగా నవీన్ పట్నాయక్‌ను ప్రజలు ఆదరించడం వర్తమాన రాజకీయ వర్గాల్ని ఆలోచింపజేస్తుంది.



అభిమాన సంద్రంలో నవీన్ పట్నాయక్

మానవత్వం చూపిన ఉపాధ్యాయులు



ఆస్పత్రికి తీసుకొచ్చిన ఉపాధ్యాయులు

జయపురం: ప్రమాదాల్లో గాయపడి రోడ్డుపై ఉన్న వారిని చూసీచూడనట్లు వెళ్లిపోయే ఈ సమాజంలో గాయపడి రక్తపు మడుగులో ఉన్న క్షతగాత్రులను హాస్పిటల్‌కు తీసుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు ఏడుగురు ఉపాధ్యాయులు. కొరాపుట్ జిల్లా కొలాబ్ సమీప తెంతులిగుడ గ్రామానికి చెందిన ధనుర్జయ కిరసాని, అతడి భార్య సబితా కిరసానిలు ఇద్దరు పిల్లలతో జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి కుదల్‌జొడి గ్రామంలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం 5 గంటలకు తమ బైక్‌పై తిరిగి తెంతులిగుడకు వస్తుండగా బొయిపరిగుడ సమితి మటికపల్లి – దొరాగుడ కూడలి వద్ద అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనుర్జయ తీవ్రంగా గాయపడి అచేతనుడిగా పడిపోయాడు. అతడి భార్య సబిత కూడా తీవ్రంగా గాయపడి భర్త పరిస్థితిని చూసి విలపించింది. అయితే ఆ సమయంలో అదే మార్గంలో పాఠశాల నుంచి వస్తున్న ఉపాధ్యాయులు సౌమ్యరంజన్ ప్రధాన్, సుశీల మహంతి, ప్రకాశ కుంభార్, బాలకృష్ణ త్రిపాఠీ, అనూప్ రవుత్, నవీన మెలక, భవానీ బెహరలు ప్రమాదంలో గాయపడిన వారిని చూచారు. వెంటనే వారు ఒక ఆటోను రప్పించి వారిని ఆటోలో ద్వారా బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్చారు. ధనుర్జయ తలకు బలమైన గాయం కావడం వలన ప్రథమ చికిత్స చేసి జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అతడి భార్య సబిత కిరసానికి తలపైన శరీరంలో పలుచోట్ల గాయాలు కాగా, వారి ఇద్దరి బిడ్డలకు ఎటువంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను సకాలంలో హాస్పిటల్‌కు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను పలువురు ప్రశంసించారు.

క్లుప్తంగా

ముఖలింగేశ్వరుని సన్నిధిలో తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆలయ సన్నిధిలో వెంకటేష్

జలుమూరు: ప్రసిద్ధి శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుడిని తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, మారిటైమ్ బోర్డు చైర్మన్ టి.ఎన్ వెంకటేష్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ చరిత్రను వివరించారు.

ఈదుపురంలో పోలీసు పహారా



పహారా కాస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం రూరల్: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపి దారుణ హత్యకు గురైన నేపథ్యంలో ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. జూన్ 17న గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట, రెండు రోజుల క్రితం కూటమి నాయకుడు విడుదల చేసిన వివాదాస్పద వాయిస్ రికార్డు దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఏఎస్‌ఐ శంకరరావు, ముగ్గురు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కరువు భత్యం చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, సహాధ్యక్షుడు నెమలిపురి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 జులై నుంచి ఇప్పటివరకు నాలుగు విడతలుగా బకాయిలు పడ్డ డీఏలన్నీ కలిపి 16.38 శాతం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఇసుక వాహనాల అడ్డగింత



ఇసుక లారీలను నిలిపివేసిన చీడివలస గ్రామస్తులు

బూర్జ : ఇసుక వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళి చెలరేగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బూర్జ మండలం చీడివలస గ్రామస్తులు శనివారం పలు లారీలను అడ్డుకున్నారు. కాఖండ్యాం, తమరాం ఇసుక ర్యాంపుల నుంచి రాత్రీపగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక లారీలను అడ్డుకోవడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి పంపించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జీఎంఆర్ ఏఈఆర్‌టీ ఆధ్వర్యంలో వివిధ ఎయిర్‌పోర్టుల్లో ఫైర్ ఫైటర్స్ పోస్టుల భర్తీకి ఈ డ్రైవ్ నిర్వహించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 24 ఏళ్ల యువత జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. 1600 మీటర్ల పరుగు, బరువు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. వివరాలు తర్వాత వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కొత్తూరు: కడుము గ్రామంలో అరసా ట్రేడర్స్ రైస్ మిల్లులో శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, ఎస్‌ఐ టి.రామారావు, సీఎస్‌డీటీ భీమారావులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల 50 కిలోల బరువు గల 700 పీడీఎస్ బియ్యం బస్తాలను పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను విచారణ చేయగా.. కొత్తూరు మండలంలో టీడీపీ నేత, కడుము ఎంపీటీసీకి చెందిన అరసా రైస్ మిల్లు నుంచి బియ్యం తీసుకొస్తున్నట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో జిల్లా విజిలెన్స్ అధికారులు మిల్లులో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వీఆర్వో చిన్న లోకేష్ పాల్గొన్నారు. కాగా, కొత్తూరు, తదితర మండలాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని చిల్లర వర్తకుల ద్వారా కొనుగోలు చేసి పాచిపెంట మీదుగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం.

జోరుగా వరినాట్లు







గజపతి జిల్లా గుసాని సమితి కృష్ణసాగరం ఆయకట్టు దిగువన కోర్సండ గ్రామంలో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉన్నా గజపతి సాగరం, రామసాగరం, కృష్ణసాగరాల ఆయకట్టు కాలువల ద్వారా సాగునీరు అందడంతో రైతులు ఖరీఫ్ పంట సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాశీనగర్‌లో సరా, బడిగాం గ్రామంలో వంశధార బృహత్తర ఎత్తిపోతల పథకాలు నిర్మించినా సరైన నిర్వహణ సిబ్బంది లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ పాలో విమర్శించారు. ఆంధ్ర–ఒడిశాలో కాశీనగర్ బ్లాక్ నేరడి వద్ద బృహత్తర ఎత్తిపోతల పథకం పునరుద్ధరించాలని కోరుతున్నారు. - పర్లాకిమిడి



నడకయాతన

రాయగడ జిల్లాలోని మునిగుడ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న మునిఖోల్ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాల్లో నివసించేవారు అందరూ డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలే. డొంగిరియా ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం డొంగిరియా కొంధొ డవలప్‌మెంట్ ఏజెన్సీ (డీకేడీఏ) పేరిట ప్రత్యేక ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. డొంగిరియాలు నివసించే గ్రామాలను అభివృద్ధి చేయడం, మౌలిక సౌకర్యాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. అయితే ప్రతీ ఏడాది రూ.కోట్లలో నిధులు విడుదలవుతున్నా, ఆయా గ్రామాల్లో అభివృద్ధి జాడలు కనిపించడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో రహదారులు బురదమయంగా మారాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు రహదారుల సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతున్నారు. - రాయగడ

ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి

● కేంద్రమంత్రి జుయెల్ ఓరాం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజల ప్రతినిధిగా శాసనసభ నుంచి పార్లమెంటు వరకు సుదీర్ఘ కాలం విజయవంతంగా బాధ్యతలు నిర్వహించిన కేంద్రమంత్రి జుయెల్ ఓరాం ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలగనున్నట్లు శనివారం ప్రకటించారు. సంబలపూర్ గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయంలో పాల్గొన్న కార్యక్రమంలో ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఆయన సుందరగడ్ పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర దళిత వ్యవహారాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. తాను మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. సంబల్‌పూర్‌లో జరిగిన జాబ్‌మేళాలో ఈ ప్రకటన చేశారు. పోటీ నుంచి వైదొలగి యువతకు అవకాశం కల్పించాలనే దృక్పథంతో ఈ యోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వరుసగా 6 సార్లు పార్లమెంటు సభ్యునిగా, 2 సార్లు రాష్ట్ర శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వహించగలిగినట్లు పేర్కొన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరమైనా పార్టీ కార్యకలాపాలు, సంస్థాగత వ్యవహారాల్లో చివరివరకు అంకిత భావంతో సేవలందించి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

రాజకీయ వర్గాల్లో ఉలికిపాటు

రాష్ట్ర ప్రజాప్రతినిధుల్లో పార్టీలకు అతీతంగా జుయెల్ ఓరాం సీనియర్ గిరిజన రాజకీయ నాయకుడు కావడం విశేషం. తాను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించడం రాష్ట్ర రాజకీయ వర్గాలను ఉలికిపాటుకు గురి చేసింది. ప్రస్తుతం ఆయన కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన 6 పర్యాయాల్లో గిరిజన వ్యవహారాల మంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు నిరవధికంగా కొనసాగిస్తున్నారు. ప్రజా ప్రాతినిధ్య రంగంలో జుయెల్ ఓరం 3 దశాబ్దాలు పైబడి తిరుగులేని నాయకుడిగా కొనసాగుతు పలు మైలురాళ్లని అధిగమించారు. రాష్ట్ర శాసనసభకు 1990, 1998 ఎన్నికల్లో పోటీ చేసి విజేతగా నిలిచారు. అలాగే సుందర్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా 6 సార్లు ఎన్నిక కావడం విశేషం. 1999 సంవత్సరంలో అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ క్యాబినెట్ మంత్రిగా కొనసాగారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా వరుసగా 3 సార్లు బాధ్యతలు నిర్వహించారు. జాతీయ ఉపాధ్యక్షుడిగా ఒక పర్యాయం కొనసాగారు. పలు కీలకమైన సంస్థాగత పదవులు, హోదాల్లో తనదైన ఉనికిని బలంగా చాటుకున్నారు.



జుయెల్ ఓరాం

కొనసాగుతున్న డ్రైవర్ల సమ్మె



డ్రైవర్లకు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: తమ డిమాండ్ల సాధనకు డ్రైవర్లు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు బస్సులు, వాహనాలు నిలిపిపోవడంతో ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇతర ప్రాంతాల నుంచి ట్రక్కులు రాకపోవడం వలన నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. అలాగే సమ్మెలో ట్యాంకర్ల డ్రైవర్లు కూడా పాల్గొనటం వలన పెట్రోలు, డీజిల్ స్టాక్ తగ్గి కొరత ఏర్పడింది. దీంతో పెట్రోలు బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. ఇదిలా ఉండగా డ్రైవర్ల సమ్మెకు పలు రాజకీయ నేతలు మద్దతు పలుకుతున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రబినారాయణ నందో సమ్మె చేస్తున్న డ్రైవర్లకు మద్దతుగా వారితో కూర్చున్నారు. అలాగే బొరిగుమ్మలో ఆందోళన జరుపుతున్న డ్రైవర్లకు బొరిగుమ్మ సమితి జర్నలిస్టులు మద్దతు తెలుపుతూ ధర్నాలో కూర్చున్నారు.



పెట్రోలు బంక్ వద్ద క్యూ కట్టిన ద్విచక్ర వాహనదారులు

వృద్ధురాలి ఆత్మహత్య

ఎచ్చెర్ల : ఎస్.ఎస్.ఆర్.పురం గ్రామానికి చెందిన నారాయణమ్మ (75) అనే వృద్ధురాలు చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏడాది కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న ఈమె గ్రామంలోనే చిన్న కుమార్తె దుర్గ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 10న ఉదయం ఆమె అపస్మారక స్థితిలో ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పక్కనే చీమల మందు గిన్నె కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు వృద్ధురాలిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ మావోయిస్టులు అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసులు శనివారం సాయంత్రం ముగ్గురు నకిలీ మావోయిస్టులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో సమితిలోని కుఫాకోల్ గ్రామానికి చెందిన బినోద్ నాగ్, మాలిగుడ గ్రామానికి చెందిన నరేంద్ర నాగ్‌లతో పాటు మరో మైనర్ బాలుడు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాసీపూర్‌లో నివాసముంటున్న వ్యాపారి శేఖర్ బిసాయికి గుర్తు తెలియని వ్యక్తులు మావోయిస్టులమని బెదరించి లేఖ రాశారు. అనంతరం ఫోన్ ద్వారా మాట్లాడి తమకు రూ.50 లక్షలు ఇవ్వకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. దీంతో గత్యంతరం లేని వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ వాయిస్ రికార్డు ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. వారు నకిలీ మావోయిస్టులుగా నిర్ధారణ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.



అరెస్టైన నకిలీ మావోయిస్టులు

పచ్చని ఉద్దానంలో విధ్వంసం తగదు

వజ్రపుకొత్తూరు రూరల్/మందస : పచ్చని చెట్లతో కోనసీమను తలపిస్తూ జిల్లాకు వరంగా ఉన్న ఉద్దాన ప్రాంతాన్ని కార్గో ఎయిర్ పోర్టు పేరుతో విధ్వంసం చేయడం తగదని వామపక్ష నాయకులు అన్నారు. జీడి, కొబ్బరిపంటలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఉద్దాన రైతులను నిరాశ్రయులను చేయడం ఎంత వరకు సమంజసమో చెప్పాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంత బాధిత గ్రామాల్లో శనివారం రైతులతో కలిసి కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా వామపక్షాల నాయకులు చైతన్య ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షులు కొమర వాసు, జోగి అప్పారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములను నమ్ముకున్న జీవనోపాధి సాగిస్తున్న ప్రజలను అభివృద్ధి పేరుతో పొట్ట కొట్టడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కొంత కాలంగా గ్రామస్తులు ఉద్యమాలు చేస్తున్నా కనీసం పట్టించుకోకుండా సర్వేలు చేపట్టడం దారుణమని మండిపడ్డారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబై, విశాఖపట్నం లాంటి నగరాలకు అనుసంధానంగా కార్గో ఎయిర్ పోర్టులు ఉన్నాయని, దేశంలో ఎక్కడా ప్రత్యేక కార్గో ఎయిర్ పోర్టు లేదని గుర్తు చేశారు. పచ్చని ఉద్దానాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్గో ఎయిర్ పోర్టు పోరాట కమిటీ నాయకులు కోనారి మోహన్‌రావు, బత్తిని లక్ష్మణ్, పోతనపల్లి కుసుమ, డి.హరికృష్ణ, కె.రమేష్, జోగి కోదండరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు, రైతులు

జిల్లా స్థాయి బాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బాడ్మింటన్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎస్‌వీ జ్యూయలర్స్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పేరిట రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ మాట్లాడుతూ ఆరు విభాగాల్లో పోటీలు జరుగుతాయని, విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, జిల్లా బాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు తదితరులు మాట్లాడుతు టోర్నీ నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, దాతలు కిరణ్‌కుమార్, ఊన్న కిరణ్‌కుమార్, గెంజి భీమారావు, కిమ్స్ సీఓఓ డాక్టర్ రవిసంతోష్, సోలార్ ఎనర్జీ నరసన్నపేట కె.రమణ, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు గురుగుబెల్లి ప్రసాద్, ఎంఈ రత్నాజీ, మెండ శాంతికుమార్, సంతోష్‌కుమార్, ఎల్.రవి, గురుగుబెల్లి రవి, శరత్, మోహన్‌సాయి, రిఫరీలు, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన క్రీడాకారులు..

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. సుమారు 400 మంది బాలబాలికలు, సీనియర్ క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. అండర్–11, 13, 15, 17, 19 బాలబాలికలకు, అలాగే స్త్రీ, పురుషుల(సీనియర్స్) విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లలో పోటీలు జరుగుతున్నాయి. తొలిరోజు రాత్రి 10 గంటల వరకు పోటీలు జరిగాయి. ఆదివారం సాయంత్రంతో పోటీలు ముగుస్తాయని అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ, టోర్నీ చీఫ్ రిఫరీ సంపతిరావు సూరిబాబు తెలిపారు.





ఏదీ భద్రత

ఇదేనా బాధ్యత..!

పబ్లిక్ ఏం చేయాలి..

రోడ్లపై ఇటువంటి దృశ్యాలు కనిపించినప్పుడు **1033** టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.

చట్టం ఏం చెబుతోంది..

హైవే రోడ్లపై ఇసుక, కంకర, ఊక, ఆయిల్ మరే ఇతర లోడులైనా ఒరిగిపడిపోయినప్పుడు వాటిని తక్షణమే క్లియర్ చేయాల్సిన బాధ్యత కన్సెషనర్లది (రోడ్డు కాంట్రాక్టర్లది). ఒకవేళ వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యి ఆగినా, ప్రమాదాలకు గురై ఎక్కువ సేపు నిలిచినా చుట్టూరా రేడియం స్టిక్కర్లు అంటించాలి. ఆ ప్రదేశంలో సూచీ బారికేడ్లు పెట్టాలి. కన్సెసనర్లు బాధ్యత విస్మరిస్తే ఇలాంటి ఒక ట్రెండు నిర్లక్ష్యాలను చూసి ఎన్‌హెచ్ఏఐ వారు రెండు నోటీసులు జారీ చేస్తారు. అప్పటికీ మించితే వారిని తొలగిస్తారు.

- వాహనాల నుంచి ఇసుక జారిపోతున్నా పట్టించుకోని వైనం
- జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడే ఇసుక మేటలు
- ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ఇసుక వాహనాల నిర్వాహకులు
- ప్రమాదాలకు ఆలవాలంగా మారిన హైవే కటింగ్ పాయింట్లు

చిత్రం చెప్పిన కథ

ఎచ్చెర్ల / శ్రీకాకుళం క్రైమ్: రహదారి భద్రత మనందరి బాధ్యత. చక్కటి నినాదం. కానీ భద్రత పాటిస్తున్నదెవరు? అంత బాధ్యతగా మెలుగుతున్నదెవరు. పై వాక్యాలకు నిదర్శనం ఈ చిత్రం. ఎచ్చెర్ల మండలంలోని కొయ్యరాళ్ల జంక్షన్‌లో సర్వీస్ రోడ్‌లోకి ఎంటరయ్యే ప్రదేశం ఇది. చూడండి ఎంత ఇసుక రోడ్డు మీద ఒలిగిపోయిందో.. ఈ ఇసుక కారణంగా గురువారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చాలా మంది వాహనాలు ఇక్కడ అదుపుతప్పి స్కిడ్ అయ్యాయి కూడా. ఇసుకను తరలించే వాహనదారులు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. రహదారి బాధ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు కంట పడలేదో.. పడినా ఫిర్యాదు రాలేదు కదా అని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారో.. వాహనదారులకు మాత్రం చుక్కలు కనబడ్డాయి.

ఏదీ ప్రమాదాల నివారణ.. నిరంతర నిఘా..

ప్రమాదాలకు ఆస్కారమైన.. వాహనాల రాకపోకలు అధికంగా సాగే జాతీయ రహదారిపై నిరంతరం సేవలందించే హైవే పెట్రోల్ సిబ్బంది దృష్టి కూడా ఈ ప్రాంతంపై పడలేదు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటూ ప్రమాదాల కట్టడికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని చెప్పే వీరెవరి కంటినీ శుక్రవారం ఉదయం నుంచి ఈ ఇసుక రేణువు తాకలేదు.

క్లుప్తంగా

గుండాం సమీపంలో ఏనుగులు



జీడి తోటల్లో ఏనుగులు

సీతంపేట: సీతంపేట-కురుపాం మండల సరిహద్దు ప్రాంతమైన గుండాం గ్రామం వైపు ఏనుగులు వెళ్లినట్టు అటవీ శాఖ సిబ్బంది శనివారం తెలిపారు. గత పక్షం రోజులుగా నాలుగు ఏనుగులు మోహన్‌కాలనీ, గోరపాడు, చిన్నబగ్గ బీట్ పరిధిలో తిరిగి పైనాపిల్ పంటలను నాశనం చేశాయి. అరటి చెట్లను విరిచేశాయని స్థానికులు తెలిపారు. పంట నష్ట పరిహారం ఇచ్చే విధంగా అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

వ్యక్తిపై కేసు



నిప్పు పెట్టడంతో కాలిపోతున్న పూరి పాక

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురంలో కొద్ది రోజులుగా ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న స్థల వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ వివాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ జి.కళాధర్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి...హుస్సేనుపురానికి చెందిన బంధువులైన వావిలపల్లి సూర్యనారాయణ, బొత్స రామారావులకు కొద్ది రోజులుగా గ్రామంలో ఓ స్థల వివాదం నడుస్తోంది. తన స్థలంలో పూరిపాక వేశారంటూ రామారావు శనివారం ఉదయం ఆ పూరిపాకపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఆ సమయంలో పూరిపాకలో ఉన్న సూర్యనారాయణ ప్రాణ భయంతో పరుగులు తీశాడు. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ స్వల్పంగా గాయపడ్డాడు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సి ఉండగా ఇలా నిప్పు పెట్టి తనను భయభ్రాంతులకు గురిచేసిన రామారావుపై చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్.ఐ తెలిపారు.

గంజాయి నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణ నియంత్రణే లక్ష్యంగా పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రైళ్లలో గంజాయి రవాణా జరగకుండా ఉండేందుకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో లోకల్ పోలీసులు, జీఆర్‌పీ, ఈగల్, ఆర్‌పీఎఫ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి ప్రధానంగా రవాణ అవుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. విజయనగరం వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సిబ్బందికి ముందస్తుగా కొన్ని సూచనలు చేసి తనిఖీలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ శ్రీధర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, 40 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, రాస్తారోకోలు వంటి వాటికి ముందస్తు అనుమతులు తప్పనిసరని డీఎస్పీ ఎం.శనివారం శనివారం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 30 నెల రోజుల పాటు అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు దీనికి సహకరించాలని కోరారు.

గోడను బైక్ ఢీకొని బాలుడు మృతి



ప్రణీత్ (ఫైల్)

విజయగరం క్రైమ్: విజయనగరం మండలం ధర్మపురి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పిన్నింటి ప్రణీత్(15) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపేటకు చెందిన ప్రణీత్ తన ఇద్దరి స్నేహితులతో బైక్‌పై ఈ నెల 9న సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భీమిలి రోడ్డు మీదుగా ధర్మపురి రోడ్డులోకి వస్తున్న బైక్ రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి గోడను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో విజయనగరంలోని ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్ శనివారం మృతి చెందినటుట రూరల్ ఎస్ఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నిర్లక్ష్యం..!

- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- విద్యుత్ ప్రమాదాలు బారిన పడి మరణిస్తున్న ప్రజలు, మూగజీవాలు
- విద్యుత్ శాఖ ఉద్యోగులు సైతం ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్న వైనం
- 2024-25లో 30 మంది మృతి
- 16 మూగ జీవాల మృత్యువాత



ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యుత్ ఉద్యోగి పేరు రెహమాన్. జామి మండలం శాసనపల్లి గ్రామంలో జేఎల్‌ఎం(జూనియర్ లైన్‌మన్ గ్రేడ్ 2)గా పని చేసేవాడు. నెల రోజుల కిందట సోమయాజులపాలెంలో విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో మృతి చెందాడు. అందొచ్చిన కొడుకు మరణించడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

ఎస్.కోట మండలం వేమాలపల్లి గ్రామంలో లగుడు ప్రదీప్ అనే యువకుడు పొలం నుంచి గడ్డి మోపు తీసుకుని వెళ్తుండగా వేలాడుతున్న విద్యుత్ వైర్ తగలడంతో మృతి చెందాడు. వివాహం అయిన నెల రోజులకే మృతి చెందడంతో ఆకుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

నెల్లిమర్ల మండలంలో గుషిణి గ్రామంలో కొద్ది నెలల క్రితం విద్యుత్ పనులు చేపట్టేందుకు జూనియర్ లైన్‌మన్ (గ్రేడ్-2)గా పని చేసే కోటరావు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ లోగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడక్కడే మృతి చెందాడు.

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రజలతో పాటు పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



విజయనగరం పైడిమాంబ కాలనీలోని సాయి కీర్తన నగర్‌లో ప్లేట్స్ ఎర్త్ లేని ట్రాన్స్‌ఫార్మర్

అలసత్వం

పొలాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లు సకాలంలో సరిచేయకపోవడం, ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరిచేయకపోవడం, ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను ఇళ్లకు దూరంగా జరపకపోవడం, విద్యుత్ స్తంభాలపై పిచ్చిక గుడులు మాదిరి కేబుల్ వైర్లను అమర్చినా వారిపై చర్య తీసుకోకపోవడం, విద్యుత్ మరమ్మతులు చేపట్టేటప్పుడు విద్యుత్ నిలిపివేతలో జాగ్రత్తలు తీసుకోకపోవడం తదితర కారాణాలు వల్ల విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొంత స్తంభాల మాదిరిగానే..

విద్యుత్ స్తంభాలను కేబుల్ ఆపరేటర్లు సొంత స్తంభాల మాదిరి వాడుకుంటున్నారు. పట్టణాల్లోను, పల్లెల్లోను ఇదే పరిస్థితి. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టలుకట్టలుగా కట్టేస్తున్నారు. దీంతో విద్యుత్ పనులు చేపట్టేందుకు విద్యుత్ సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిత్యం ఈ దృశ్యాలను చూస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో పొలంలో కొన్నాళ్ల కిందట విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు వాటిని తీయలేదు. అదే గ్రామానికి చెందిన రైతు కోరాడ ఈశ్వరరావు పొలంలోకి వెళ్లగా కాలికి విద్యుత్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడు. భర్త రాలేదని పొలంలోకి అతని భార్య ఆదిలక్ష్మి వెళ్లింది. క్రింద పడి ఉన్న భర్తను లేపడానికి ప్రయత్నించగా ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయింది.

నెల్లిమర్ల మండలం అల్తిపాలేంలో కేబుల్ ఆపరేటర్ వద్దాది ఉమామహేశ్వరరావు విద్యుత్ స్తంభం లైనుకు కేబుల్ వైర్ పెడుతుండగా 11కేవీ వైర్ తగిలి చనిపోయాడు.

చర్యలు తీసుకుంటున్నాం..

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ సమస్యలపై సమాచారం వచ్చిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– మువ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

వర్షాకాలంలో..

ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. 2024-25లో 30 మంది విద్యుత్ ప్రమాదాలు వల్ల మృతి చెందారు. 16 పశువులు మృతి చెందాయి. 2025-26లో ఏప్రిల్ నుంచి జూన్ నెలఖారు నాటికి ఐదుగురు మృతి చెందగా.. నాలుగు మూగజీవాలు మృతి చెందాయి.

డ్రోన్ల సహాయంతో పోలీసుల దాడులు



డ్రోన్ల సాయంతో బహిరంగ మద్యం సేవిస్తున్న వారిపై పోలీసుల దాడులు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులు డ్రోన్ల సహాయంతో కొరఢా ఝుళిపిస్తున్నారు. జిల్లాలోని జామి పోలీస్‌స్టేషన్ పరిధి భీమసింగి, పెదమానాపురం పోలీస్ స్టేషన్ పరిధి మానాపురం సంత శివారు ప్రాంతాల్లో శనివారం ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిపై డ్రోన్ల సహాయంతో శనివారం దాడులు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా డ్రోన్ల సాయంతో దాడులు చేస్తున్నారు. ఇలా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పెదమానాపురం సంత వద్ద కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వేరొక లారీ

బొండపల్లి: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బొండపల్లి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు...గొట్లాం బైపాస్ రోడ్డుపై శనివారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ రెల్లి నాయుడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కొనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను రక్షించడానికి ప్రయత్నించడగా ఫలితం లేకపోవడంతో తక్షణమే జిల్లా కేంద్రంలో ఉన్న అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి రోప్‌లు, కట్టర్లతో శ్రమించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి చికిత్స కోసం 108లో జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు.



లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం

- ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

విజయనగరం గంటస్తంభం: భారత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం అమలుచేయాలని అన్ని రాష్ట్రాల మీద రుద్దుతోందని, దీనిని వ్యతిరేకిద్దామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పలుపునిచ్చారు. కె.ఎల్.పురం ఎస్‌పీఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు డి.రాము ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలు నూతన విద్యా విధానాన్ని అమలు చేసేదిలేదని అసెంబ్లీల్లో తీర్మానం చేయగా, చంద్రబాబు ప్రభుత్వం మిన్నకుండడం విచారకరమన్నారు. ప్రైవేట్ విద్యా విధానాన్ని పెంపొందించేందుకు పీ–4 విధానాన్ని తీసుకొస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని, హాస్టల్ భవనాలు నిర్మిస్తామని, వసతులు కల్పిస్తామంటూ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలు అమలుచేయకుండా విద్యార్థిలోకాన్ని మోసం చేశారన్నారు. విద్యార్థులను అణగదొక్కే కూటమి ప్రభుత్వ చర్యలపై ఎదురుతిరగాల్సిన సమయం ఆసన్నమైందని, పోరాటాలకు సిద్ధంకావాలన్నారు. సభలో ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇ.రాము, సీహెచ్.వెంకటేష్, సభ్యులు శిరీష ,రాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లీనరీ సమావేశానికి ముందు పతాకావిష్కరణ చేస్తున్న విద్యార్థులు

క్లౌడ్ సెంటర్‌గా సెంచూరియన్ విశ్వవిద్యాలయం

నెల్లిమర్ల రూరల్: క్లౌడ్ సెంటర్‌గా సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని తీర్చిదిద్దామని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది అన్ని విభాగాల్లో ఏఐ సాంకేతికతను చేరుస్తామన్నారు. దేశంలో అగ్రగామిగా ఉన్న 50 సంస్థలతో తాము ఎంఓయూ కుదుర్చుకున్నామని చెప్పారు. దేశంలో 28 నానో చిప్స్ తయారు చేస్తున్న మొదటి విద్యాలయం సెంచూరియన్ అని తెలిపారు. యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల శిక్షణలు అందిస్తున్నామని, ఏటా కొత్త కోర్సులు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్, రిజిస్ట్రార్ పల్లవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఆకుల రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 14న మధ్యాహ్నం రెండు గంటల్లోపు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి సూచించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 15న ఉదయం 11 గంటలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీవీఈవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గంధవరపు అప్పాలు(ఫైల్)

గజపతినగరం: మండలంలోని భూదేవిపేటకు చెందిన గంధవరపు అప్పాలు(71) శనివారం రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడని బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. అప్పాలు తన సొంత గ్రామం భూదేవిపేట గ్రామం నుంచి ఆరోగ్య తనిఖీ నిమిత్తం మరుపల్లి గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి బయలుదేరారు. మార్గ మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో దాన్ని దాటుతుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అప్పాలు అక్కడికక్కడే మృతి చెందాడని హెచ్‌సీ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడు గ్రామంలో పూజారిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుధీర్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధి నవోదయ విద్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు అందించిన వివరాలు.. మండలంలోని లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన కండిపల్లి సుధీర్(18) తన స్నేహితులతో కలిసి బొద్దవర పంచాయతీ అంబదాసుపాలెం గ్రామానికి చెందిన నిఖిల్ ఆటోలో శుక్రవారం రాత్రి ముషిడిపల్లి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో నవోదయ విద్యాలయం దాటగానే ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సుధీర్ ప్రమాద స్థలంలో మృతి చెందగా, ఆటో నడుపుతున్న నిఖిల్, గణేష్, జగదీష్ గాయపడ్డారు. వీరిని ఎస్‌కోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వీరిలో గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల ఆందోళన

- మంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

పార్వతీపురం టౌన్: దివ్యాంగుల సమస్యలకు పరిష్కారం చూపాలని దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముంద్రంగి లచ్చన్న దొర డిమాండ్ చేశారు. శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ వద్ద తమ సమస్యలను నిరసన రూపంలో తెలియజేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నూతనంగా ఏర్పడి మూడేళ్లు అయినా నేటి వరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ కింద సహాయక సంచాలకుల వారి కార్యాలయం పార్వతీపురంలో ఏర్పాటు చేయాలేదన్నారు. తద్వారా జిల్లాలో గల దివ్యాంగులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తక్షణమే ఏడీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గతంలో జిల్లాలో 4 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగిన ఏఎల్‌ఐఎంసీవో క్యాంపులలో దివ్యాంగులకు మంజూరైన పరికరాలను వెంటనే ఇప్పించాలన్నారు. నిరసనలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



తిప్పలవలస గ్రామంలో అక్రమంగా నిల్వ వున్న పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన పౌర సరఫరాల శాఖ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో అక్రమంగా నిల్వ వుంచిన 40 బస్తాలు పీడీఎస్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్టు భోగాపురం సీఎస్‌డీటీ బీవీ మురళీకృష్ణ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రాయితి లక్ష్మి ఇంట్లో వుంచిన పీడీఎస్ బియ్యాన్ని భోగాపురం, రాజాం, గజపతినగరం, గంట్యాడ సీఎస్‌డీటీలు మురళీకృష్ణ, ఎస్.చిరంజీవి, ఎన్.మూర్తి, కె.తిరుపతి బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించగా అక్రమంగా బియ్యం నిల్వ వున్నట్టు కనుగొని సీజ్ చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని భోగాపురం పౌర సరఫరాలు శాఖ గోడౌన్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడులలో వారితో పాటు వీఆర్‌వో టి.ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: మండలంలో పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టగా కొత్తూరు మండలం కడుమ గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రం నవరంగాపూర్‌కు తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ కానిస్టేబుళ్లు పురుషోత్తమ, తిరుపతిరావు మరియు రెవెన్యూ శాఖ అధికారి హేమలత, పాచిపెంట సీఎస్‌డీటీ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం పర్యటించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామిని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలోని 1, 30 వార్డుల్లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని అతిథి గృహానికి వచ్చిన మంత్రిని ఎస్పీ అక్కడ కలిశారు.



రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు కరువు!

- పీ–4 కర్యాక్రమాన్ని పట్టాలెక్కించే యాతనలో జిల్లా అధికారులు
- సర్వేలో 20 శాతం నమోదయిన 67,066 బంగారు కుటుంబాలు
- ఇంతవరకు ముందుకొచ్చిన మార్గదర్శకులు 2,200 మంది మాత్రమే

విజయనగరం అర్బన్: పేదరికంలేని సమాజం నిర్మిస్తామంటూ కూటమి ప్రభుత్వం తలపెట్టిన పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ (పీ–4) కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో స్పందన కరువైంది. ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాల (బంగారు కుటుంబాలు)ను దత్తత తీసుకునే ధనిక వర్గాలకు చెందిన మార్గదర్శకులను వెతికేందుకు అధికారులు తలలుపట్టుకుంటున్నారు. ఆగస్టు 15 నాటికి దత్తత కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్న ఆదేశాలు అమలయ్యే సూచనలు కనిపించడం లేదు. బంగారు కుటుంబాలను గుర్తించేందుకు ఈ ఏడాది మార్చి 20 నుంచి అధికారులు సర్వేచేశారు. జిల్లాలో 67,066 మంది అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించారు. చీపురుపల్లి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల పరిధిలో అధిక కుటుంబాలు పేదరికంలో ఉన్నట్టు సర్వేలో తేల్చారు. ఆ జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ధనిక, పారిశ్రామిక కుటుంబాలు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటి వరకు 2,200 మంది మాత్రమే ముందుకొచ్చారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అందుకునేందుకు అధికారులు నానాపాట్లు పడుతున్నారు.

బంగారుకుంబాల తుది జాబితా కోసం గ్రామ, వార్డు సభలు: కలెక్టర్

జిల్లాలోని బంగారు కుటుంబాల తుది జాబితాను ఖరారు చేసేందుకు ఈనెల 15 నుంచి గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సర్వే ద్వారా గుర్తించిన 67,066 బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునఃపరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటు అందిస్తారన్నారు.

గంజాయితో ముగ్గురి యువకుల అరెస్టు



గంజాయి తరలిస్తున్న యువకులను పట్టుకున్న గుర్ల పోలీసులు

గుర్ల: మండలంలోని మణ్యపురిపేట వద్దనున్న తారకరామ తీర్థ సాగర్ కాలువపై గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నారాయణ రావు శనివారం తెలిపారు. మణ్యపురిపేట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా కేజీ గంజాయిని పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి తరలిస్తున్న వారిలో గరికివలసకు చెందిన ఆవాల రాజేష్, కెల్లకు చెందిన మీసాల రమేష్ , పూసపాటిరేగకు చెందిన మంత్రి రామారావు ఉన్నారని వారిని ఆరెస్ట్ చేసి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ సీజ్ చేసామని చెప్పారు. గంజాయి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయడంతో గుర్ల పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు అభినందించారు.